క్లుప్తంగా

నేడు ఆసరా సమావేశం

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడో విడత ఆసరా లబ్ధిపొందిన డ్వాక్రా మహిళలతో సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు సమావేశానికి తరలి రావాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులు



జాతీయ బాల్ బాడ్మింటన్ పోటీల్లో ట్రోఫీలు అందుకున్న యానాం క్రీడాకారులు

యానాం: మహారాష్ట్రలో మూర్తిజాపూర్ అకోలా జిల్లాలో జరిగిన 67వ జాతీయ జూనియర్ బాల్ బాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో పుదుచ్చేరి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన యానాం బాల్ బాడ్మింటన్ క్లబ్ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారని సోమవారం కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శ శేష సుమన్, కోచ్ బొట్టా శ్రీనివాస్ తెలిపారు. డబుల్స్ బాలుర విభాగంలో తృతీయ, మిక్స్‌డ్ డబుల్స్‌లో తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారని తెలిపారు. క్రీడాకారుడు పెస్సింగి చిన్నికృష్ణ బాల్ బాడ్మింటన్ క్రీడలో అత్యంత గుర్తింపున్న స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును సాధించాడన్నారు. క్రీడాకారులు రమ్యతేజశ్రీ, అనూష, వాసు, వర్మ, అలీ, ప్రవీణ్‌కుమార్‌లు విశేష ప్రతిభ కనబరిచారని అభినందించారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం



ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకరుడు

తాళ్లరేవు: ఉప్పంగల పంచాయతీ తంగేడు పంపు గ్రామంలోని ఊటకాలువలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ శాకా శంకరుడు సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకరుడు మాట్లాడుతూ ఊటకాలువలో పూడికలు పెరిగిపోయి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పూడికలు తొలగించి కాలువను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు

అమలాపురం టౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సంపన్నులకు కొమ్ము కాస్తోందని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ విమర్శించారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్రజాస్వామిక పరిపాలన చేస్తున్నారంటూ ప్రభాకర్ ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి కె.సత్తిబాబు, నియోజకవర్గ కార్యదర్శి అడపా సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యుడు మోకా శ్రీనివాసరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇల్లు కూల్చివేత ఘటనపై కేసు

ఉప్పలగుప్తం: మండలంలోని తమ ఇల్లు కూల్చేశారంటూ ఫిర్యాదు రావడంతో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చల్లపల్లి గ్రామానికి చెందిన గొలకోటి నాగలక్ష్మికి తన తండ్రి ద్వారా సంక్రమించిన పెంకుటిల్లు ఉంది. నాగలక్ష్మి కుటుంబీకులు ప్రస్తుతం కాకినాడలో నివాసం ఉండటంతో సదరు పెంకుటిల్లు నిరుపయోగంగా మారింది. దీంతో ఎదురింట్లో నివాసముండే డి.రాంబాబు వద్ద గుమాస్తాగా పనిచేసే ఎం.వెంకటేష్ తరచూ తమకు ఫోన్ చేసి ఆ ఇంట్లో విషసర్పాలు చేరుతున్నాయని, ఇంటిని అమ్మడమో, కూల్చివేయడమో చేయాలని ఒత్తిడి చేసేవారని, గత నెల 30న ఇల్లు కూల్చేశారని నాగలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రాంబాబు, వెంకటేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గాయపరిచిన వ్యక్తిపై కేసు

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురు సర్పంచ్‌ను గాయపర్చిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. కొండుకుదురుకి చెందిన పెంటా శ్రీనివాసనాయుడు, పెంటా విశ్వేశ్వరరావులు చీటీపాట సొమ్ము విషయంలో గొడవ పడుతున్నారు. వీరిని వారించేందుకు సర్పంచ్ మేడిద దుర్గాప్రసాద్ ప్రయత్నించారు. ఈ సందర్భంలో శ్రీనివాస నాయుడు సర్పంచ్ దుర్గా ప్రసాద్‌ను గాయపర్చాడు. దీనిపై సర్పంచ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రహరీని ఢీకొట్టిన ఆటో

అంబాజీపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం సమీపాన సోమవారం ఓ ఇంటి ప్రహరీని ఆప్పీ ఆటో బలంగా ఢీకొట్టింది. రావులపాలెం నుంచి అమలాపురం వెళుతున్న ఆటో అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న ఓ ఇంటి ప్రహరీగోడను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ దేసిరెడ్డి శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సాయంతో 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మీ సేవలకు సలాం కొట్టాల్సిందే

- పారిశుధ్య కార్మికులవి వెలకట్టలేని సేవలు
- నిత్యం అపరిశుభ్రత నడుమే విధులు

అమలాపురం టౌన్: ఏదైనా శుభకార్యానికో, పుణ్యక్షేత్రానికో, బంధువుల ఇంటికో వెళ్లి నాలుగైదు రోజుల తరువాత తిరిగొస్తే ఇల్లు ఎలా తయారవుతుంది..? దుమ్మంతా దులుపుకుని, మూలమూలన తుడిచి, నేలంతా తడిగుడ్డ పెట్టకుండా ఆ ఇంట్లో ఉండగలమా? ముగ్గురో నలుగురో నివాసముండే ఇల్లే అలా అయిపోతే..? మరి తెల్లారిలేస్తే ప్రజలంతా కలియతిరిగే రోడ్లు, వీధులు ఓ వారం పాటు శుభ్రం చేయకపోతే పరిస్థితి ఏంటి? అంతెందుకు మనం వాడి పాడేసే చెత్తాచెదారాన్ని రోజూ పారిశుధ్య కార్మికులు తీసుకెళ్లకపోతే వీధులు ఎంత అధ్వానంగా తయారవుతాయో ప్రత్యేకించి చెప్పాలా? మనం అత్యంత సాధారణంగా చూసే పారిశుధ్య కార్మికుల విధుల్లోకి తొంగిచూస్తే.. వారి నిత్యకృత్యం ఏమిటో లోతుగా ఆలోచిస్తే వారి సేవలకు ఎవరైనా సలాం చేయాల్సిందే.

డ్రైనేజీల్లో దిగి.. చెత్తాచెదారం తొలగించి..

అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీల్లో సుమారు 205 మంది రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ (కాంట్రాక్ట్), వికాస్ ద్వారా నియమించుకున్న రోజువారీ కూలీలు పారిశుధ్య కార్మికులుగా సేవలందిస్తున్నారు. అర్ధ రాత్రి నుంచే వారి విధులు మొదలవుతాయి.



మేజర్ డ్రైయిన్‌లోకి దిగి చెత్త అడ్డంకులను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు



చనిపోయిన పంది కళేబరాన్ని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు

తెల్లవారకముందే రోడ్లను ఊడ్చి చెత్తాచెదారాన్ని తీసేసి పరిశుభ్రంగా ఉంచుతారు. రోడ్లు ఊడవడం, ఇంటింటి నుంచి చెత్త తీసుకెళ్లడం సాధారణ విధుల్లానే కనిపించొచ్చు. కాని మురికి కంపు కొట్టే డ్రెయిన్లలోకి దిగి అడ్డుకున్న చెత్తా చెదారాన్ని తొలగించి మురుగు ప్రవాహన్ని ముందుకు నడిపిస్తున్నారు. పీకల్లోతున్న డ్రెయిన్లలో సైతం ఏదో పంట కాల్వలోకి దిగినంత సునాయాసంగా దిగి పరిశుభ్రం చేసేస్తారు. ఇటీవల కాలంలో అంతు చిక్కని వైరస్‌తో తుప్పలు, చెత్త కుప్పలు, పాడు పడిబడిన భవనాల్లో మృత్యువాత పడుతున్న పందులను అక్కడ నుంచి తొలగిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడైనా కుళ్లిపోయిన పందులున్నా సరై వాటిని అక్కడి నుంచి తీసి ఖననం చేస్తుంటారు. అమలాపురం మున్సిపాలిటీలో గత మూడు నెలల కాలంలో సుమారు 1200 పందుల మృతదేహాలను జనావాసాల నుంచి వారే తొలగించి దుర్గంధం లేకుండా చేశారు.

అమలాపురం, ముమ్మిడివరంలో పారిశుధ్య కార్మికుల వివరాలు

మున్సిపాలిటీ / నగర పంచాయితీ	రెగ్యులర్	కాంట్రాక్ట్	రోజువారీ కూలీలు	మొత్తం
అమలాపురం	48	89	30	167
ముమ్మిడివరం	1	27	10	38
	49	116	40	205

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, మంచినీటి సౌకర్యాలపై అధికారులు శ్రద్ధ తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. మండలంలో జెడ్పీ బాలుర, ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, అయినాపురం, అనాతవరం ప్రభుత్వ పాఠశాల, ముమ్మిడివరం గురుకుల పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో మొత్తంగా 679 మంది విద్యార్థులకు గాను 677 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. ఐ.పోలవరం మండలంలోని మురమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, సాయి కాన్వెంట్, ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల(ఎ), జెడ్పీ పాఠశాల(బీ) పరీక్షా కేంద్రాల్లో మొత్తంగా 694 మంది విద్యార్థులకు గాను 691 మంది పరీక్ష రాశారు.

ఉప్పలగుప్తం: మండల వ్యాప్తంగా చల్లపల్లి, గొల్లవిల్లి, భీమనపల్లిల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో తొలి రోజు తెలుగు పరీక్షకు 599 మంది విద్యార్థులకు గాను 598 మంది హాజరయ్యారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్షాకేంద్రం వద్ద జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు విద్యార్థులను కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.



మురమళ్లలో పరీక్షకు హాజరైన విద్యార్థులు



తాళ్లరేవులో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



దేవగుప్తంలో పరీక్షా కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు

తాళ్లరేవు: మండల పరిధిలోని ఆరు కేంద్రాల్లో 1095 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాశారు. తాళ్లరేవులోని శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మూడు సెంటర్లకు గానూ 655 మంది హాజరు కావాల్సి ఉండగా 645 మంది మాత్రమే హాజరయ్యారు. 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీవైఈఓ ఆర్జేడీ రాజు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అల్లవరం: మండలంలోని అల్లవరం, కొమరగిరిపట్నం, దేవగుప్తం ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఈఓ కిరణ్ బాబు తెలిపారు. నాలుగు కేంద్రాల్లో 635 విద్యార్థులకు గాను 628 మంది పరీక్ష రాశారని, మరో ఏడుగురు గైర్హాజరయ్యారని చెప్పారు.

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్, కనకాలపేట ఎస్‌కేఎస్‌పీఆర్ఎస్ ప్రభుత్వ హైస్కూల్, మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్‌ల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. రీజినల్ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ మాట్లాడుతూ మూడు కేంద్రాల్లో కలిపి 693 మంది విద్యార్థులకు గాను 686 మంది హాజరయ్యారని తెలిపారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. సోమవారం అమలాపురం పట్టణంలోని వార్డు సచివాలయాల్లో పార్టీ కన్వీనర్లు, గృహ సారథులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణిలు అతిథులుగా హాజరై ఈ నెల 7వ తేదీ నుంచి వారం రోజుల పాటు జరిగే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో గృహసారథుల అనుసరించాల్సిన విధివిధానాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారికి సంక్షేమ పథకాల మెటీరియల్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ సచివాయాల కన్వీనర్ల అధ్యక్షుడు ఈతకోట శ్రావణ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు నాగారపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయాలి



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ దంపతులను సత్కరిస్తున్న పాస్టర్లు

అల్లవరం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు దళిత క్రైస్తవులందరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. మండల పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవగుప్తంలోని క్రీస్తు ఆలయంలో సోమవారం ఆయనకు సన్మానం చేశారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు సీయోను రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చడానికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక జీఓ తీసుకొచ్చి అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తు చేశారు. అనంతరం ఇజ్రాయిల్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు, మాజీ ఎంపీటీసీ సాధనాల మాణిక్యం, ఎన్‌జే రాజు, బెనర్జీ, మోజెస్, విప్పర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ని కలిసిన అధికారులు

ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారి స్వగ్రామం గోడి విచ్చేసిన ఇజ్రాయిల్‌ను అల్లవరం మండల స్థాయి అధికారులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు తహసీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్, ఎంపీడీఓ జి.సరోవర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ఐ దుర్గా శ్రీను, ఈఓపీఆర్‌డీ సూరపరాజు, జిల్లా కార్యదర్శుల జిల్లా అధ్యక్షుడు ఎస్.దుర్గా శ్రీను, ప్రచార కార్యదర్శి రాజ్‌మోహన్, జి.వాసు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కోనేరులో కోనేటిరాయుని విహారం

వైభవంగా అమలాపురం వెంకన్న తెప్పోత్సవం





ఆలయ పుష్కర కోనేరులో నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలోని పుష్కర కోనేరులో స్వామి వారి తెప్పోత్సవం సోమవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో, పూలమాలలతో అలంకరించిన మినీ పంటుపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచారు. లాహిరి లాహిరిలా.. కడు కమనీయంగా.. తెప్పోత్సవం వైభవోపేతంగా ముందుకు కదిలింది. కోనేరులో కోనేటిరాయుడు తన దేవురులతో పుష్కర కోనేరులో తెప్పపై విహరిస్తున్న దృశ్యాన్ని వేలాది మంది భక్తులు కోనేరు గట్లపై నుంచి వీక్షించి పునీతులయ్యారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, భారీ ఎత్తున బాణ సంచా కాల్పుల నడుమ తెప్పోత్సవం భక్తుల గోవింద నామస్మరణతో సాగింది. జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి కేవీడీ దుర్గా ప్రసాద్, ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, ఆలయ ధర్మకర్తలు తెప్పోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మశ్రీ సుదర్శనం మురళీకృష్ణాచార్యులు అర్చకత్వంలో పట్టణానికి చెందిన హోల్‌సేల్ కిరాణా వ్యాపారి రేపాక సత్యనారాయణమూర్తి కుటుంబీకులు ఈ తెప్పోత్సవాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి ఆధ్వర్యంలో యువకుల బృందం భక్తులకు సేవలందించింది.

చెత్త సమస్యకు తాత్కాలిక పరిష్కారం



మాచవరంలో చెత్త వేసేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ముక్కంటి

అంబాజీపేట: మాచవరం పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను డంపింగ్ చేసేందుకు తాత్కాలిక పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి చెప్పారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో చెత్త సమస్యపై అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. గ్రామంలో చెత్తను తరలిస్తున్న మాచవరం, హడ్కో కాలనీలలో కాకుండా ప్రభుత్వ భూముల వివరాలపై తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, ఈఓపీఆర్డీ బి.మమత, కార్యదర్శి కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. పీర్మాయిపాలెంలో కౌశిక వంతెన వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించగా వేరే పంచాయతీకి చెందడంతో అధికారులు వెనుదిరిగారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోవడంతో ఈ నెల 6న సమావేశం నిర్వహించి చెత్తను డంపింగ్ చేసేందుకు శాశ్వత పరిష్కారంపై చర్చిస్తామన్నారు. మాచవరం శివారు కొత్తపాలెం కౌశిక వద్ద చెత్తను తాత్కాలికంగా తరలిస్తామన్నారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని గత రెండు వారాలుగా పేరుకుపోయిన చెత్తను తొలగించి పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించామన్నారు. పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు మాత్రమే తాత్కాలికంగా డంపింగ్ చేస్తున్నామన్నారు. గ్రామ పెద్దలు, కాలనీవాసులతో చర్చించిన అనంతరం యథావిధిగా రెండు ప్రాంతాల్లో చెత్త వేసేలా ప్రయత్నం చేస్తామని ఆర్డీఓ వివరించారు. ఆర్డీవో వెంట ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వోలు రమేష్, రమణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన



పెనికేరులో క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో కలవచర్ల, నవాబుపేట, పెనికేరు గ్రామాల్లో సోమవారం వైద్యారోగ్య సిబ్బంది క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఆధ్వర్యంలో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షయ వ్యాధి నియంత్రణకు ఆధునిక వైద్య చికిత్స అందుబాటులో వచ్చినందున రోగగ్రస్తులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఏఎన్ఎంలు వి.రమణ, టి.సుశీల, కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ సోక్ పిట్స్‌తో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నరసింహారావు

రావులపాలెం: జగనన్న కాలనీల్లో నూతనంగా నిర్మించనున్న మ్యాజిక్ సోక్‌పిట్స్‌తో సంపూర్ణ పారిశుధ్యం సాధించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ బీవీఎల్ నరసింహారావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం హాలులో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో కొత్తపేట నియోజకవర్గంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు మ్యాజిక్ సోక్‌పిట్స్ నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ జగనన్న కాలనీ లే–అవుట్‌లలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన చోట్ల మ్యాజిక్ సోక్‌పిట్స్ నిర్మాంచాలన్నారు. రావులపాలెం, ఆలమూరు, ఆత్రేయపురం, కొత్తపేట మండలాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సోక్‌పిట్స్ నిర్మాణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్, రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్లు కేవీవీ సత్యనారాయణమూర్తి, పి.పద్మ, ఎం.పోశమ్మ, వై.శ్రీధర్, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్లు వి.వెంకటరెడ్డి, ఎస్.జేజిబాబు, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సదస్యం



ఆలయంలో నిర్వహిస్తున్న సదస్యం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో సోమవారం సదస్యం కార్యక్రమాన్ని వేద పండితులు, అర్చకు లు కన్నులపండువగా నిర్వహించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. వేకువ జామునే స్వామి వారి గ్రామోత్స వం జరిగింది. పలు కార్యక్రమాలు వేదపండితు లు మంత్రపఠనంతో నిర్వహించారు. వేకువ జా ము నుంచే భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య ఆధ్వర్యాన ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేనకేశ్వరుడికి అభిషేకాలు

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన పార్వతీ సమేత మేనకేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామా సమేత కృష్ణరాయుడు స్వామి వార్ల కల్యాణంలో భాగంగా సోమవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక బుచ్చి ఆధ్వర్యంలో సదస్యం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



కేవీపోడు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కృష్ణకిరణ్

సఖినేటిపల్లి/మలికిపురం: మండలంలోని ఉయ్యూరువారి మెరక శివారు కంతేటివారిపోడులో ప్రాథమిక పాఠశాల, మలికిపురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ జె.కృష్ణకిరణ్ తనిఖీ చేశారు. పథకంలో భాగంగా వండుతున్న వంటకాలను ఆయన పరిశీలించి రుచి చూశారు. పథకాన్ని మరింత బాగా నిర్వహించాలని పాఠశాల బోధన సిబ్బందికి సూచించారు. ఎంఈవో నల్లి మనోహరం, పాఠశాల స్టాఫ్, డీఎస్‌వో ఎ.పాపారావు, ఏఎస్‌వో వై.ప్రతాప్‌రెడ్డి, డీటీ శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో స్టాక్ రిజిస్టర్‌లోని సరుకులను కూడా పరిశీలించారు. ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

పి.గన్నవరం: శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక మూడు రోడ్ల సెంటర్లో శ్రీసీతా రామ వర్తక సంఘం ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మధ్యాహ్నం 3 గంటల వరకూ షాపులను మూసివేసి, వ్యాపారులు సేవలు అందించారు. సంఘ అధ్యక్షుడు తెలగారెడ్డి అగ్ని సుబ్బారావు, ఉపాధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు రాలింగి రామకోటేశ్వరరావు, నాయకులు తమ్మన ప్రసాద్, గిడుగు బాబ్జీ, షేక్ దొరబాబు, కట్టా గోపి, కదలి శ్రీను, సంఘ సభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

జ్యోతిషరత్న అవార్డు స్వీకరణ

ఆలమూరు: మండలంలోని సంధిపూడికి చెందిన ఇలపర్తి వెంకటేష్ జ్యోతిషరత్న అవార్డు స్వీకరించారు. జ్యోతిష రంగంలో ఉన్న విశేష అనుభవాన్ని గుర్తించిన విజయవాడకు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ సోమవారం స్థానిక గోల్డేన్ వే హోటల్‌లో జ్యోతిష రంగ పండితుల చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మేడపాటి లక్ష్మణరావు (బాబీ), వారణాసి బ్రహ్మాజీ, గుండు బ్రహ్మన్న, మండల బ్రాహ్మణ సంఘ సమాఖ్య సభ్యులు అభినందనలు తెలిపారు.

మోటారు సైక్లిస్టుకు గాయాలు

అంబాజీపేట: అంబాజీపేట శివారు జయంతినగర్ మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. కె.పెదపూడికి చెందిన చిట్టుగుళ్ల భరత్ తన బైక్‌పై అంబాజీపేట వస్తున్నాడు. గంగలకుర్రు నుంచి రావులపాలెం వైపు వెళుతున్న ఇటుక లోడు ట్రాక్టర్ జయంతి నగర్ మలుపు వద్దకు వచ్చేసరికి ఢీ కొట్టడంతో భరత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు.

చిన్నారికి నగదు సాయం

అంబాజీపేట: కాళ్ల ఆపరేషన్ కోసం ఓ చిన్నారికి పి.గన్నవరం మండలం ముంజవరంకు చెందిన దైవాల రాంబాబు, చిన్నల ఆధ్వర్యంలో నగదు సాయాన్ని సోమవారం అందించారు. చర్చి పాస్టర్ ఎల్.జోసెఫ్ చేతుల మీదుగా రూ.5 వేల నగదును మాచవరం శివారు పోతాయిలంకకు చెందిన ఆరేళ్ల ఈతకోట సాత్విస్ తండ్రి వెంకట్‌కు అందజేశారు. తన కుమారుడు సాత్విస్ వైద్యానికి సహకరిస్తున్న దాతలకు వెంకట్ కృతజ్ఞతలు తెలిపాడు.

6న దుర్గమ్మకు వసంతోత్సవం

మామిడికుదురు: పెదపట్నంలంక కనకదుర్గమ్మకు ఈ నెల 6వ తేదీ గురువారం వసంతోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సోమవారం తెలిపింది. ఉదయం 9.15 గంటలకు దుర్గమ్మకు ఏకాదశ రుద్రాభిషేకం, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, నవదుర్గారాధన, అభిషేకాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అమ్మవారికి లక్ష చామంతి పూజ, లలితా హోమం జరుగుతుందన్నారు. ఈ పూజలకు భక్తులు హాజరు కావాలని ఆలయ కమిటీ కోరింది.

రొయ్యల చెరువు తవ్వకాలు నిలిపేయాలి

అయినవిల్లి: మండలంలోని పోతుకుర్రులో రొయ్యల చెరువు తవ్వకాలను నిలిపివేయాలని ఆ గ్రామస్తులు అమలాపురంలో స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో తాగునీరు కలుషితం అవుతుందని, పంటభూములు బీడు భూములుగా మారుతాయన్నారు.